
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 20 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 880 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



మహిళా మార్ట్‌లో ఉద్యోగాలు

మహిళా మార్ట్‌లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. 21న అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయి. 8లో

గరిష్టం/కనిష్టం
37.8°/22.3°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

బాధ్యతగా పనిచేయాలి



కలెక్టర్ అరుణ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: ఉద్యోగులంతా బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. సోమవారం ఆయన ధర్మవరం మున్సిపల్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కౌన్సిల్ హాలులో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. విధుల్లో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు ఆయా శాఖల పనితీరుపై సమీక్షిస్తామని, ఎక్కడైనా తేడాలు వస్తే ఉపేక్షించబోమన్నారు. సచివాలయ సిబ్బందితో పాటు ఉద్యోగులంతా విధిగా సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు.

సెంచరీ దాటిన పీజీ వైద్య సీట్లు

- కొత్తగా రేడియాలజీకి 12, ఫార్మకాలజీకి 5 సీట్లు



ప్రభుత్వ వైద్య కళాశాల

అనంతపురం క్రైం: బోధనాస్పత్రి(ప్రభుత్వ వైద్య కళాశాల- సర్వజనాస్పత్రి)లో పీజీ వైద్య సీట్లు వంద దాటాయి. ఒక్క పల్మనాలజీ విభాగానికి మినహా మిగతా 16 విభాగాలకు పీజీ సీట్లు మంజూరయ్యాయి. కొత్తగా రేడియాలజీ విభాగానికి 12, ఇదివరకే రెండు సీట్లు ఉన్న ఫార్మకాలజీ విభాగానికి మరో 5 అదనపు పీజీ సీట్లను కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అనంతపురం వైద్య కళాశాలలో పీజీ సీట్ల సంఖ్య 104కు చేరింది. ముఖ్యంగా రేడియాలజీ విభాగానికి అధిక సంఖ్యలో సీట్లు రావడంతో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీంతో రేడియాలజీ సేవలు మరింత విస్తృతమయ్యే అవకాశం లేకపోలేదు. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ తదితర సేవలు పుంజుకొని రోగులకు మెరుగైన సేవలందనున్నాయి. ఫార్మకాలజీ విభాగానికి 5 సీట్లు రావడంతో ఆ విభాగం వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ పీజీ సీట్ల సంఖ్య వంద దాటడంతో ఏటా 312 మంది (ఫస్టియర్ 104, సెకండియర్ 104, థర్డ్ ఇయర్ 104 మంది చొప్పున) పీజీ వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పీజీ సీట్ల పెంపుతో నూతన ఆవిష్కరణకు ఆస్కారం ఉంటుందన్నారు. రోగులకు సత్వర వైద్యం అందుతుందన్నారు. వైద్య రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలతోనే ఈ స్థాయిలో పీజీ సీట్ల పెంపు సాధ్యపడిందని చెబుతున్నారు.

కియా అనుబంధ పరిశ్రమ కార్మికుడి మృతి



మృతుడు విఘ్నేష్ ఉదయ్ కుమార్

పెనుకొండ రూరల్: పని ప్రాంతంలో అస్వస్థతకుగురైన ఓ కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. వివరాలు.. తమిళనాడులోని సేలం పట్టణానికి చెందిన విఘ్నేష్ ఉదయ్‌కుమార్ (30) పెనుకొండ సమీపంలోని కియా అనుబంధ హుండై ట్రాన్సిస్ పరిశ్రమలో లైన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరైన ఆయన పని ప్రాంతంలో శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండడంతో గమనించిన యాజమాన్యం వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా పరిస్థితి విషమంగా మారడంతో హుటాహుటిన పెనుకొండలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే విఘ్నేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి ఏడాది క్రితమే వివాహమైనట్లు సమాచారం.

ఆర్‌అండ్‌బీలో ఇష్టారాజ్యం



టీడీపీ నేత తమ్ముడికి జీహుజూర్

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తమ్ముడు జయప్పకు ఆర్‌అండ్‌బీ అధికారులు జీహుజూర్ అన్నారు. జయప్ప సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని, అతను వర్కులు చేయడం లేదని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మరో సంస్థ పేరుతో ఆయనకు టెండరు అప్పజెప్పిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మడకశిర నియోజక వర్గంలోని పరిగి–యు.రంగాపురం, అమరాపురం–మధూడి, మధూడి–గాయత్రి కాలనీ రోడ్డుపనులకు ఇటీవలే టెండర్లు పిలిచారు. ఈ మూడు పనుల విలువ రూ.6.45 కోట్లు పైనే. సాధారణంగా సింగిల్ టెండరు వస్తే మళ్లీ టెండరు పిలవాలి. కానీ ఇలా చేయకుండా నేరుగా ఇచ్చారు. దీని వెనుక భారీ మొత్తం చేతులు మారినట్టు తెలుస్తోంది.

- అర్హత లేని కాంట్రాక్టరుకు రూ.4.64 కోట్ల పనులు
- కొన్ని చోట్ల సింగిల్ టెండరుకే పనుల అప్పగింత
- టీడీపీ నేత జయప్పకు జీహుజూర్
- వేరే కాంట్రాక్ట్ సంస్థ పేరుతో టెండరు కట్టబెట్టిన వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ)లో ఇష్టారాజ్యం నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా పనులు అప్పగిస్తున్నారు. ఈ శాఖ పరిధిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.100 కోట్లకు పైగా విలువైన పనులు జరుగుతున్నాయి. ఇంత పెద్దఎత్తున పనులు చేపడుతున్నప్పుడు అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి. కానీ విచ్చలవిడిగా టెండర్లు కట్టబెడుతున్నట్లు విమర్శలొస్తున్నాయి. అలాగే కాంట్రాక్టర్లు కమీషన్లు ఇవ్వనిదే బిల్లులు చేయని దుస్థితి నెలకొంది. ఇదేమని అడిగితే పనుల్లో కొర్రీలు వేసి తిప్పుకుంటున్నారు. కొన్నిచోట్ల కాంట్రాక్టర్లకు ఆయాచిత లబ్ధి కలిగేలా ఎస్టిమేషన్లు పెంచుతున్నట్టు తేలింది.

అర్హత లేకున్నా పనులు

ఒక రోడ్డు పని అప్పజెప్పాలంటే టెండరు నోటిఫికేషన్ ఇవ్వాలి. తొలిసారి, రెండో సారి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా ఎవరూ పోటీ రానప్పుడు మాత్రమే మూడోసారి సింగిల్ బిడ్డర్‌కు ఇవ్వాలి. కానీ ఇటీవల తాడిపత్రి–పాతపల్లె రోడ్డు పనులు అర్హత లేని కాంట్రాక్టరుకు అప్పజెప్పినట్టు తెలిసింది. రూ.4.64 కోట్ల విలువైన ఈ పనుల విషయంలో కనీసం కాంట్రాక్టరు అర్హత కూడా చూడలేదు. కాంట్రాక్టరుతో ఆర్‌అండ్‌బీలో ఓ ఉన్నతాధికారి మామూళ్లు తీసుకుని ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒకటికి రెండు సార్లు టెండరు డాక్యుమెంట్లు పరిశీలించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

బిల్లు పెట్టాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందే

ఆర్‌అండ్‌బీ పరిధిలో చాలాచోట్ల కార్యాలయ, ఆస్పత్రుల భవన నిర్మాణాలు జరిగాయి. వాటికి బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఆర్‌అండ్‌బీ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రెండు శాతం పర్సెంటేజీ ఇస్తే వెంటనే బిల్లులు పెడతారని, లేదంటే 'సైట్ విజిట్' అని రాస్తారని వారు వాపోతున్నారు. నిర్మాణాన్ని పరిశీలించడానికి వెళ్లి ఏదో ఒక కొర్రీ వేస్తూ బిల్లులు జాప్యం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో కొంతమంది అధికారుల అక్రమాలు బయటకు చెబుతున్నారన్న కారణంగా సిబ్బందిని బదిలీ చేసిన ఘటనలూ ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ల వ్యవహారంపై విజయవాడలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు కొంతమంది కాంట్రాక్టర్లు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



కాంట్రాక్టర్ ఎంపిక నాది కాదు

తాడిపత్రి–పాతపల్లె రోడ్డు పనుల కాంట్రాక్టరు ఎంపిక సీఈ ఆధ్వర్యంలో జరిగింది. బిల్లులు జాప్యమనేది ప్రొసీజర్‌ను బట్టి ఉంటుంది. కావాలని జాప్యం చేస్తే సంబంధిత జేఈని పిలిచి విచారించి, చర్యలు తీసుకుంటాం.

–ఓబుళరెడ్డి, ఎస్‌ఈ, రోడ్లు, భవనాల శాఖ

బత్తలపల్లిలో ఘర్షణ

- బైక్‌పై అంత వేగంగా ఎందుకొస్తున్నావని ప్రశ్నించినందుకు గొడవ
- ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు



మృతుడు యర్ర రామయ్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాశప్ప

బత్తలపల్లి: బైక్‌పై అంత వేగంగా ఎందుకొస్తున్నావని ప్రశ్నించినందుకు ఇద్దరి మధ్య మొదలైన వాగ్వాదం.. కొంతసేపటికే రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీకి చెందిన నాగభూషణ కుమారుడు ప్రవీణ్ ద్విచక్రవాహనంలో వేగంగా వస్తుండగా, అంత వేగంగా ఎందుకు వస్తావని చిన్నకాశప్ప అనడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఆ చెప్పే విధానం సరిగా లేదంటూ ద్విచక్రవాహనదారుడు ప్రవీణ్ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలోనే సాకే చిన్న కాశప్ప, ఆయన కుమారులు గంగన్న, పురుషోత్తం, కుమార్తె వరలక్ష్మీ, కోడలు ఉమాదేవిలకు, ప్రవీణ్ అతని బంధువులు యర్ర రామయ్య (60), ఆయన కుమారుడు శివకృష్ణ, గౌతమి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అందరూ గాయపడగా, చిన్న కాశప్ప, యర్ర రామయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రవేట్ ఆసుపత్రులకు తరలించారు. చికిత్స పొందతూ యర్ర రామయ్య మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా 'జగనన్న సురక్ష'

- 'స్పందన' అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' అర్జీలను ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం', 'స్పందన'లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 239 అర్జీలు అందగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. లేకపోతే అవి మళ్లీ రీఓపెన్ అవుతాయన్నారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రతి అధికారీ పనిచేయాలన్నారు. రోజూ సంబంధిత శాఖల అధికారులు స్పందన, జగనన్నకు చెబుదాం అర్జీలను మానిటర్ చేయాలన్నారు. జిల్లాలో జూలై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా జూన్ 24 నుంచి 30 వరకూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. ఆరు రోజుల పాటు ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సర్టిఫికెట్లు అవసరమో తెలుసుకోవాలన్నారు. అనంతరం సర్టిఫికెట్ల మంజూరులో ఇబ్బందులు పడుతున్న వారిని క్యాంపులకు పిలిపించి అవసరమైన డాక్యుమెంటేషన్ తీసుకోవాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకూ ప్రతి సచివాలయం, వార్డు పరిధిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయం ముందుగానే ఆయా ప్రాంతాల్లో తెలియజేయాలన్నారు.

బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి..

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ వివరించారు. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాల్లో పనులు ప్రారంభించామని, అయితే హిందూపురం, కదిరి, రొద్దం, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో బిల్లులు అప్‌లోడ్ చేయలేదన్నారు. అధికారులు వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేసే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఉపాధి పథకం కింద జిల్లాలో లక్ష పని దినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులు సైతం ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయ, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తదితర ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాల్లో ప్రగతి సాధించాలన్నారు. ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హౌసింగ్ లేఅవుట్లను తనిఖీ చేసి నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, ఏడీ రామకృష్ణ, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన, సివిల్ సప్లయిస్ అధికారి వంశీకృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

క్షుద్రపూజల పేరుతో మహిళల ట్రాప్



అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న వైఎస్సార్ జిల్లా ఏఎస్పీ ప్రేరణాకుమార్

- తిరుపతికి చెందిన మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి
- ఏడుగురు ముఠా సభ్యుల అరెస్టు
- ప్రధాన సూత్రధారుడు బాబా కోసం గాలింపు

ప్రొద్దుటూరు క్రైం : క్షుద్రపూజల పేరుతో మహిళలను ట్రాప్ చేస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. తిరుపతికి చెందిన బాధిత మహిళ ఫిర్యాదుతో ముఠా మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో ముఠాలోని ఏడుగురు సభ్యులను వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారుడు అయిన బాబా కోసం గాలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. తిరుపతికి చెందిన ఒక మహిళ ఆర్థిక సమస్యలతో బాధపడేది. తన కుమార్తెలకు వయసు వచ్చినా ఇంకా పెళ్లిళ్లు కాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో ఓ బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబంలోని ఇతర సమస్యలు కూడా పూర్తిగా తీరిపోతాయని ఒక మహిళ ద్వారా తెలుసుకున్న ఆమె.. సదరు ముఠా సభ్యులను ఆశ్రయించింది. తిరుపతి మహిళను ఫోన్‌లో సంప్రదించిన మోసగాళ్లు ఆమెను కడపకు రమ్మని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ముఠా సభ్యులు కొందరు ఆమెతో కడపలో సమావేశం అయ్యారు. అయితే వారు పెట్టిన కొన్ని షరతులకు ఆమె అంగీకరించకపోవడంతో రెండు రోజుల క్రితం తిరిగి వారు ప్రొద్దుటూరులో సమావేశమయ్యారు. ఈ క్రమంలో పూజలు చేస్తామని నమ్మబలికిన కేటుగాళ్లు ఆమెను లైంగికంగా వేధింపులకు గురి చేశారు. దీంతో వారి బారి నుంచి తప్పించుకుంది. జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు నిందితుల అరెస్ట్..

ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆదేశాల మేరకు సీఐ యుగంధర్, ఎస్‌ఐ కృష్ణంరాజునాయక్‌లు సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ముఠా సభ్యులు అమృతానగర్‌లో ఉన్నారని తెలియడంతో దాడులు నిర్వహించారు. దాడిలో అనంతపురం జిల్లాకు చెందిన వసారింటి నాగరాజు, కంబగిరి రాముడు, వడ్డే వెంకటేష్, కర్నూలు జిల్లాకు చెందిన మార్కె కంబగిరి రాముడు, మొట్టే కాంతమ్మ, నంద్యాల జిల్లాకు చెందిన జిట్టా రవికుమార్, తిరుపతికి చెందిన పాలిచెర్ల ప్రియను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రధాన సూత్రధారి బాబా, మరి కొందరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం..

ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న మహిళలను ఈ ముఠా టార్గెట్ చేస్తోంది. ఇందుకోసం ముఠాలోని మహిళలను ఏజెంట్లుగా ఉపయోగించుకుంటున్నారు. వారి ద్వారానే అమాయక మహిళలను ట్రాప్ చేస్తున్నారు. క్షుద్ర పూజలకు అంగీకరించిన మహిళలను లొంగదీసుకొని వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల వ్యభిచార నిర్వాహకులతో వీరికి సంబంధం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వారి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీరి ఉచ్చులో పడి ఎంత మంది మహిళలు మోసపోయారనే దానిపై కూడా పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ యుగంధర్, ఎస్‌ఐ కృష్ణంరాజునాయక్, బ్లూకోల్ట్స్ సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్, ఏఎస్పీ ప్రేరణాకుమార్ అభినందించారు.

'పోలీసు స్పందన'కు 56 వినతులు



వృద్ధురాలి సమస్య వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'పోలీసు స్పందన' కార్యక్రమానికి వివిధ సమస్యలపై 56 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా వినతులు స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలోఅదనపు ఎస్పీ విష్ణు, 'దిశ' డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

నేడు 'గురుకుల' ప్రవేశ పరీక్ష

లేపాక్షి: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం రాత పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. టేకులోడు, గుడిబండ, బుక్కపట్నం, నసనకోట, లేపాక్షి, రొద్దం-1, రొద్దం-2, గుండుమల, పేరూరు, రేగాటిపల్లి పాఠశాలల్లో సీట్లకు దరఖాస్తు చేసుకున్న వారు అదే పాఠశాలలో మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే పరీక్షకు హాజరుకావాలన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

విస్తరించిన ఆశల 'నైరుతి'

- రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన



ఆకాశం మేఘావృతమైన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఆలస్యంగానైనా నైరుతి రుతుపవనాలు ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా విస్తరించాయి. ఈ మేరకు సోమవారం భారత వాతావరణ శాఖ విడుదల చేసిన ఛాయాచిత్రం స్పష్టం చేస్తోంది. ఈ నెల 8న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు 13న శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలను కూడా తాకాయి. కానీ... వాతావరణం అనుకూలించక ఐదారు రోజులు దోబూచులాడిన పవనాల్లో ఆదివారం కదలిక వచ్చింది. సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో దాదాపు విస్తరించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ తెలిపారు. రుతుపవనాలు ముందుకు కదలడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడినందున రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షపాతం నమోదు కావచ్చని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే పరిస్థితి ఉందన్నారు. నైరుతి విస్తరించడంతో వర్షం కోసం అన్నదాత ఎదురు చూస్తున్నాడు. విత్తనాలు, ఎరువులతో సిద్ధంగా ఉన్న రైతులు ఖరీఫ్ పంట సాగు కోసం సమాయత్తంగా ఉన్నారు. జూలై నెలంతా విత్తుకునేందుకు మంచి అదనుగా శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇంకా సమయం ఉన్నందున వర్షం పడితే సాఫీగా సేద్యపు పనులు చేపట్టనున్నారు.

పోలీసులకు శిక్షణ

కొత్తచెరువు: మాబ్ ఆపరేషన్‌పై పోలీసులకు శిక్షణ కార్యక్రమం సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. రిఫ్రెష్‌మెంట్ కోర్సులో భాగంగా జిల్లాలోని పోలీసులకు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 125 మంది పోలీస్ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. ఫైరింగ్, ప్రజలు రోడ్లపై గుమికూడితే ఎలా చెదరగొట్టాలి, అల్లర్లు చెలరేగిన సమయంలో పోలీస్ సిబ్బంది స్వీయ రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు.



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులు



గుంపును చెదరగొట్టే విధానాన్ని వివరిస్తున్న దృశ్యం

అనంతపురానికి నూతన బస్ సర్వీసు

పుట్టపర్తి టౌన్: స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అభ్యర్థన మేరకు పుట్టపర్తి–అనంతపురం మధ్య నూతన బస్సు సర్వీసు ప్రారంభించినట్లు డిపో మేనేజర్ ఇనాయతుల్లా తెలిపారు. ఆదివారం బుక్కపట్నంలో చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనంతపురానికి బస్సు నడపాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరగా దీనిపై స్పందించిన ఆయన తక్షణమే సర్వీసు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారన్నారు. సోమవారం నుంచి పుట్టపర్తి నుంచి బుక్కపట్నం, కొత్తచెరువు మీదుగా అనంతపురానికి బస్సుల రాకపోకలను ప్రారంభించినట్లు వివరించారు.

మసకబారుతున్న ప్రతిష్ట

రైల్వే ఆస్పత్రిలో సమస్యల తిష్ట

- వరుస వైఫలాల్యలతో బెంబేలెత్తుతున్న రోగులు
- గణనీయంగా తగ్గిన ఓపీ సేవలు
- శస్త్రచికిత్సల్లోనూ కనిపించని పురోగతి



గుంతకల్లు రైల్వే డివిజనల్ ఆస్పత్రి ముఖద్వారం

గుంతకల్లు: గతమెంతో ఘన కీర్తి కలిగిన గుంతకల్లు రైల్వే డివిజనల్ ఆస్పత్రి ప్రతిష్ట ఇటీవల ఉద్యోగుల తీరుతో మసకబారుతోంది. రోజు రోజుకూ అధ్వానంగా మారిన వైద్య సేవలతో రోగులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి ఓ వివాహిత మృతి చెందింది. మూడు రోజుల క్రితం ఓ మహిళకు గర్భసంచి తొలిగించే ఆపరేషన్ చేస్తూ ఏకంగా మూత్ర నాళాన్ని కట్ చేశారు. దీంతో రైల్వే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలంటే రైల్వే ఉద్యోగులు, రోగులు బెంబేలెత్తిపోతున్నారు.

200కు పడిపోయిన ఓపీ..

గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పనిచేస్తున్న దాదాపు 15 వేల మంది ఉద్యోగులు, వీరి కుటుంబసభ్యులు, ఉద్యోగ విరమణ చేసిన వారితో కలిపి లక్ష మందికి పైగా రైల్వే ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. గతంలో రోజూ 500 మందికి పైగా ఓపీ సేవలు అందుకునే వారు. ఇటీవల వరుస వైఫల్యాలతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు 200కు మించి ఓపీ నమోదు కాకపోవడమే ఇందుకు నిదర్శనం. అలాగే శస్త్రచికిత్సల అంశంలోనూ పురోగతి కనిపించడం లేదు. గతంలో నెలకు 300 నుంచి 400 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లుగా ఆస్పత్రి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం నెలకు 30 ఆపరేషన్లు కూడా జరగని పరిస్థితి నెలకొంది. అరకొరగా చిన్నపాటి ఆపరేషన్లు చేసినా.. అందులో ఎక్కువ శాతం విఫలమై రోగుల పరిస్థితి విషమంగా మారిన సందర్భాలే ఉన్నాయి.

ఆధునిక వైద్య పరికరాలున్నా..

దక్షిణ మధ్య రైల్వేలో వరుసగా మూడుసార్లు బెస్ట్ అవార్డు అందుకున్న ఘన చరిత్ర కలిగిన గుంతకల్లు రైల్వే డివిజనల్ ఆస్పత్రిలో రూ. కోట్లు ఖరీదైన ఆధునిక ఆపరేషన్ థియేటర్, వివిధ వైద్య పరికరాలు ఉన్నాయి. క్లిష్టమైన ఆపరేషన్లను సైతం ఇక్కడ విజయవంతంగా నిర్వహించిన సందర్భాలు అనేకమున్నాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి సైతం రోగులు ఈ ఆస్పత్రికి వచ్చేవారు. తాజాగా చోటు చేసుకున్న కొన్ని వైఫల్యాల కారణంగా ఆస్పత్రి కీర్తి కాస్త మసకబారుతోంది. దీంతో ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందాలంటే రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వెనుకంజ వేస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు అత్యున్నత వైద్య సేవలు అందించిన ఈ ఆస్పత్రి ప్రస్తుతం కేవలం జ్వరం, తలనొప్పి, జలుబు వంటి చిన్నపాటి జబ్బుల చికిత్సలకే పరిమితమవుతోంది.

సమన్వయ లోపమే కారణమా?..

ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్లు, నర్సుల మధ్య సమన్వయం కొరవడడంతో వైద్య సేవలు నానాటికీ క్షీణిస్తూ వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఘటన ఇందుకు నిదర్శనం. టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన కొందరు చిన్నారులకు చికిత్స చేసిన డాక్టర్ ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ఆధారంగా కాకుండా కింది స్థాయి సిబ్బంది కాంబినేషన్ మందులు ఇవ్వడంతో వారి పరిస్థితి విషమించింది. దాదాపు 8 మంది పిల్లలు ఎంతో ఇబ్బంది పడ్డారు. వీరిలో ముగ్గురు చిన్నారులను హుటాహుటిన అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ఇప్పటికైనా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను ప్రక్షాళణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైల్వే ఉన్నతాధికారులను ఉద్యోగులు కోరుతున్నారు.

పుట్టపర్తి వేదికగా నేడు ఎంహెచ్ స్మారక అవార్డు ప్రదానం

పుట్టపర్తి అర్బన్: కామ్రేడ్ మోటూరు హనుమంతరావు (ఎంహెచ్) స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ప్రదానోత్సవాన్ని పుట్టపర్తిలోని ఆర్‌వీ జానకీ రామయ్య కల్యాణమంటపంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రజాశక్తి సాహితీ సంస్థ పేర్కొంది. ప్రజాశక్తి సంపాదకుడు తులసీదాస్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ హాజరు కానున్నారు. 'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు–మీడియా పాత్ర' అంశంపై స్మారకోపన్యాసం చేయనున్నారు. మంత్రి ఉషశ్రీచరణ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఎంహెచ్ అవార్డు కమిటీ చైర్మన్ తెలకపల్లి రవి, నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి జి.అనిత, కవి నల్లి ధర్మారావు తదితరులు హాజరు కానున్నారు. ఎంహెచ్ స్మారక అవార్డును నవభూమి పత్రిక (హైదరాబాద్) టి.ప్రసాద్‌కు, బొమ్మారెడ్డి స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును రాజమహేంద్రవరం ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాసచారికి, మండల విలేకరుల విభాగంలో హిందూపురం, సింగరాయకొండకు చెందిన షబ్బీర్, రవికుమార్‌కు అందజేయనున్నారు.

జర్నలిస్టులకు బస్సు పాసులు మంజూరు

పుట్టపర్తి టౌన్: అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు బస్సు పాసులు మంజూరు చేస్తున్నట్లు డీపీటీఓ మధుసూదన్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో జర్నలిస్టులకు బస్‌పాస్‌ల పంపిణీ కార్యాక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకూ బస్ పాస్ మంజూరు చేస్తామన్నారు. సంస్థ జారీ చేసిన దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలను ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో అందజేయాలని సూచించారు. బస్ పాస్ పొందిన జర్నలిస్టులు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎం కార్యాలయ ఏఓ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా అరుణ



కదిరి: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా జి.అరుణ అలియాస్ జ్యోతక్క నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తనకల్లు మండలం ఉస్తినిపల్లికి చెందిన జ్యోతక్క గతంలో మావోయిస్టు పార్టీలో రాయలసీమ విభాగం డీసీఎంగా పని చేశారు. ఈమె భర్త రామ్మోహన్ అలియాస్ ఎర్ర సత్యం సైతం మావోయిస్టులో కీలక సభ్యుడిగా ఉండేవారు. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌కు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీతకు, తన నియామకానికి సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



నారాయణప్ప (ఫైల్)

పరిగి: కుటుంబ పోషణ భారమై ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు...పరిగి మండలం కాలువపల్లికి చెందిన ఆర్.నారాయణ (64), లక్ష్మీదేవి దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అందరూ కలిసే జీవిస్తున్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని నారాయణ పోషిస్తున్నాడు. ఈ క్రమంలో వయసు పైబడడంతో కుటుంబపోషణ నారాయణకు కష్టమైంది. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఆదివారం రాత్రి తన కున్న మరో పాత ఇంట్లో నిద్రించేందుకు వెళ్లాడు. సోమవారం ఎంత సేపటికీ రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా అప్పటికే పైకప్పుకు తాడుతో ఉరి వేసుకుని విగత జీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిస్వార్థ సేవకుడు ఫాదర్ ఫెర్రర్

బత్తలపల్లి: కరువు జిల్లాలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పరితపించిన ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని బత్తలపల్లిలోని ఫాదర్ ఘాట్ వద్ద సోమవారం ఆర్డీటీలోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, డైరెక్టర్లు దశరథరాముడు, సాగర్‌మూర్తి, మురళీ, మనోరంజన్, రఘు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. పరులు కోసం నిస్వార్థ సేవలు అందించిన దయామయుడిగా కీర్తించారు. ఫాదర్ స్మారకార్థం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1.50 కోట్ల మొక్కలను నాటినట్లు గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో 5,450 టెంకాయ మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్థోపెడిక్ మేనేజర్ నాగరాజు, హనుమంతరెడ్డి, ఆర్‌ఈ మధుసూదన్, ఎస్టీఎల్, సీఓలు తిమ్మరాజు, వెంకటేష్, శివాజీ, సీబీటీ కాటమయ్య, ఆస్పత్రి సిబ్బంది, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఫాదర్ వర్ధంతిని బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఇంటింటా చెట్టు ఊరంతా వనం కార్యక్రమంలో భాగంగా టెంకాయ మొక్కలను నాటారు. సంజీవపురం, సూర్యచంద్రాపురం గ్రామాల్లోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించారు.



సంజీవపురంలో ఫాదర్ విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న దృశ్యం

వ్యక్తి బలవన్మరణం

మడకశిర రూరల్: మండలంలోని వైబీహళ్లికి చెందిన కోడె రంగప్ప (42) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రంగప్పకు భార్య, పిల్లలు ఉన్నారు. గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తరచూ భార్యతో గొడవపడేవాడు. ఆదివారం ఉదయం కూడా భార్యతో గొడవ పడి గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం బంధువుల ఇంటికి భార్య వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న రంగప్ప.. ఇంట్లో భార్య కనిపించకపోవడంతో మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంత సేపటికీ రంగప్ప బయటకు రాకపోవడంతో తల్లి వెళ్లి చూసింది. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపిస్తూ సమాచారం అందించడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఉరికి వేలాడుతున్న రంగప్ప మృతదేహాన్ని కిందకు దించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీ

ఓడీ చెరువు: మండలంలోని నారప్పగారిపల్లి వద్ద వెలసిన మల్లూరమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి దుండగులు చొరబడి హుండీ, బీరువాను ధ్వంసం చేసి విలువైన సామగ్రి, నగదు అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయ పూజారి రామకృష్ణ ఆలయానికి చేరుకున్నప్పుడు ఈ విషయం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దుండగుల ఆచూకీ కోసం ఆలయ పరిసరాలను సీఐ రాజేంద్ర యాదవ్, ఎస్‌ఐ గోపి గాలించారు. హుండీలోని నగదుతో పాటు సీసీ కెమెరాల డీవీఆర్, టీవీ, మైకోసెట్ ఆడియో ప్లేయర్ ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. క్లూస్ టీంను రంగంలో దించి వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆరు నెలల క్రితం ఇదే ఆలయంలో చోరీ జరిగిందని, తాజాగా రెండో సారి కూడా చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బావిలో పడి విద్యార్థిని మృతి



సాయిలీల (ఫైల్)

నల్లమాడ: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ విద్యార్థిని మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... నల్లమాడకు చెందిన భజంత్రీ మునిరత్నం, శ్రీదేవి దంపతుల కుమార్తె సాయిలీల (22) కదిరిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం దుస్తులు ఉతికేందుకు గ్రామ సమీపంలోని గంగమ్మ బావి వద్దకు వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయింది. ఈత రాకపోవడంతో నీట మునిగి ఊపిరాడక మృతిచెందింది. కుమార్తె ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బావివద్దకెళ్లి పరిశీలించగా నీటిలో తేలుతున్న మృతదేహం కనిపించడంతో బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రాజేంద్రనాథయాదవ్, ఎస్‌ఐ వలీబాషా తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కదిరి టౌన్: తిరుపతి నుంచి కదిరి మీదుగా అకోలా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని కుటాగుళ్లకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రమేష్ (45)గా గుర్తించారు. సోమవారం ఉదయం అక్కమ్మ బురుజు క్వార్టర్స్ నుంచి వస్తూ కుటాగుళ్ల వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ రహీం అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళామార్ట్‌లో ఉద్యోగావకాశాలు

అనంతపురం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా సీడాప్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తున్న 'మహిళా మార్ట్'లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు. ఎంపికైన వారికి యూనిఫాం తప్పనిసరిగా ఉంటుంది. ఆధార్‌కార్డు, స్మార్ట్‌ఫోన్, ఏ ప్రాంతంలోనైనా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. రెండు నెలల ముందే నోటీసు ఇచ్చి ఉద్యోగాన్ని విరమించాలి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 21 అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పూర్తి వివరాలకు 08554-2471122, 8985091256లో సంప్రదించవచ్చు.

ఉద్యోగం	అర్హత	వయస్సు	వేతనం	పనిచేసే ప్రాంతం
స్టోర్ మేనేజర్	ఇంటర్/డిగ్రీ	24-35	రూ.12 వేలు - రూ.15వేలు	బత్తలపల్లి, కూడేరు, గుత్తి
సేల్స్‌పర్సన్	పది/ఇంటర్	20-35	రూ.8వేలు - రూ.12వేలు	బత్తలపల్లి, గార్లదిన్నె, కూడేరు, గుత్తి
ప్రొక్యూర్మెంట్ మేనేజ్‌మెంట్	పది/ఇంటర్	21-35	రూ.12వేలు - రూ.15వేలు	అనంతపురం
సూపర్‌వైజర్	ఇంటర్	21-35	రూ.12వేలు	అనంతపురం
ఐటీ	డిగ్రీ	21-35	రూ.12 - రూ.15వేలు	అనంతపురం
లోకల్ హెల్పర్స్	పది	21-35	రూ.10 - రూ.12 వేలు	అనంతపురం
డ్రైవర్ (కేవలం పురుషులు)	పది	21-35	రూ.15వేలు	అనంతపురం
సెక్యూరిటీ గార్డ్స్ (కేవలం పురుషులు)	పది	21-35	రూ.10 - రూ.12 వేలు	బత్తలపల్లి, గార్లదిన్నె, కూడేరు, గుత్తి, అనంతపురం .